
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 15 ఆగస్టు 2025



# ఉద్యమ స్మృతులు..

- స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తినిచ్చిన సిరిసిల్ల ఆంధ్రా మహాసభ
- సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటున్న జిల్లా ప్రజలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేడుకలకు ముస్తాబైన సిరిసిల్ల పోలీస్ పరేడ్ గ్రౌండ్

రుద్రంగి మండలం మానాల గ్రామం



మానాల శిక్షణా శిబిరంలో భోజనాలు చేస్తున్న గెరిల్లాలు(ఫైల్)



సిరిసిల్లలో 1935సెప్టెంబర్ 6న జరిగిన ఆంధ్రా మహిళ మహాసభలో పాల్గొన్న ఎల్లాప్రగడ సీతాదేవి, మాడపాటి మాణిక్యమ్మ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

నిజాం సర్కార్, బ్రిటీష్ తెల్ల దొరలకు వ్యతిరేకంగా సాగిన ఎన్నో పోరాటాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కీలకభూమికను పోషించింది. ఆనాటి వీరుల త్యాగాలు.. జాతీయ జెండా రెపరెపలాడిన క్షణాన ఎగిసిన మధురక్షణాలు.. నేటికీ జిల్లా ప్రజల మదిలో కదలాడుతుంటాయి. ఆగస్టు 15,1947ఆంగ్లేయులపాలన నుంచి స్వేచ్ఛా వాయువులు పొందిన రోజు.. భారతీయులకళ్లలో విరజిమ్మినకాంతులు... వందేమాతరం, సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, విదేశీవస్తువుల బహిష్కరణ, క్విట్ ఇండియా, స్టేట్‌కాంగ్రెస్ సత్యాగ్రహాలు, సిరిసిల్ల చేనేతకార్మిక మహా సభలు, మానాలఅడవుల్లో గెరిల్లాశిబిరాలు, ఖాదీఉద్యమం, గ్రంథాల యోద్యమం, ఆంధ్ర మహాసభ, ఆంధ్రమహిళా మహాసభలు నిర్వహిస్తూ జిల్లా ప్రజలు కదం తొక్కారు. స్వాతంత్ర్య వేడుకలకు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జాతీయ పతాకాన్ని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఎగురవేయనున్నారు. ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఆనాటి పోరాట జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు.

### క్విట్ ఇండియా ఉద్యమంలో మనవాళ్లు...

స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న దేశ ప్రజలు ఆలపించడానికి వందేమాతరం జాతీయ గీతంగా ఉండగా 1938లో నిజాం ప్రభుత్వం నిషేధించింది. దీనికి వ్యతిరేకంగా మొదలైన ఉద్యమంలో ఉమ్మడి కరీంనగర్ విద్యార్థులు ముందుకు సాగారు. ఇందులో సిరిసిల్ల ప్రాంతానికి చెందిన విద్యార్థులు కూడా ఉన్నారు. సిరిసిల్ల పాత తాలుకాకు చెందిన మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు, 1939లో 7వతరగతిలో వందే మాతరం ఉద్యమం ప్రభావితం చేసింది. ఆంధ్రామహాసభ కార్యకలా పాలకు గాలిపెల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి, రుద్రంగికి చెందిన సీహెచ్ నరసింహారావు కూడా రావడంచూసి రష్యన్‌రెడ్ ఆర్మీ తెగించి పోరాడిన ఘట్టాలు చదివిన రాజేశ్వర్‌రావు వారివైపు అడుగులు వేశారు. 1942లో ఊపందుకున్న క్విట్ ఇండియా ఉద్యమంలో సీహెచ్ రాజేశ్వర్‌రావుతో పాటు సీహెచ్ హన్మంతరావు, సి నారాయణరెడ్డి, ముకుందరావు మిత్రాలు పాల్గొన్నారు. కోనరావుపేటకు చెందిన సీహెచ్ రాజలింగం బాల్యంలోనే రజాకార్ల క్యాంపుపై త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు.

### స్వాతంత్ర్య పోరులో నేతన్నలు...

సిరిసిల్ల నేత కార్మికులు ప్రజల దైనందిన సమస్యలతో పాటు చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడం కోసం చేనేత కార్మిక సంఘం ఏర్పడింది. కార్మిక సంఘం తెలంగాణ తృతీయ మహాసభను సిరిసిల్లలో జరుపుకున్నారు. 1946లో సభ నిర్వహించగా బొంబాయి, షోలాపూర్, అహ్మదాబాద్ ప్రాంతాలనుంచి చేనేత కార్మిక ప్రతినిధులు సిరిసిల్లకు తరలి వచ్చారు. సిరిసిల్లలో జరిగిన ఆంధ్ర మహాసభ చేనేత వస్త్ర రంగం లో కార్మికుల్లో చైతన్యం నింపింది. సిరిసిల్లలో నిర్వహించిన ఆంధ్ర మహాసభ, మహిళ సభలు ఉద్యమం వైపు నడిపించాయి. ఆ క్రమంలో నాలుగో ఆంధ్ర మహాసభ 1935లో సిరిసిల్లలో భీమకవి నగరంగా మాడపాటి హన్మంతరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో తెలంగాణ యోధు లు బద్దంయెల్లారెడ్డి, రామకృష్ణరావు, కెవి రంగారెడ్డి, జెవి నర్సింగారావు, సురవరం ప్రతాపరెడ్డి, రావినారాయణరెడ్డివంటి నాయకులు పాల్గొన్నారు. మహాసభ నిర్వహణలో సిరిసిల్ల తాలూకలోని గాలిపెల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి ముఖ్య భూమికను పోషించాడు. వేములవాడ భీమకవి నగరంగా నిర్వహించిన మహాసభకు వివిధ ప్రాంతాలనుంచి ఎంతో మంది పాల్గొన్నారు. సభలో నిర్బంధ ప్రాథమిక విద్య జాగీర్‌లోని ప్రజల హక్కులు, రైతాంత సమస్యలు, స్వపరిపాలన, నిమ్నజాతుల ఉద్ధరణ వాటిపై తీర్మానాలు చేశారు. ఇదే ప్రాంగణంలో 4వ ఆంధ్రా మహిళ సభ కూడా నిర్వహించారు. దీనికి మాడపాటి హన్మంతరావు సతీమణి మాణిక్యమ్మ అధ్యక్షత వహించారు. ఎల్లప్రగడ సీతాకుమారి లాంటి వారెందరో పాల్గొన్నారు. ఈ మహాసభల స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు కొత్త మలుపు తిరిగాయి. శిస్తు మాఫీ చేయాలని, నిర్బంధ లెవీ ధాన్యం వసూలు చేయవద్దని, బరాయింద ఉద్యమం నడిచింది.

### గ్రంథాలయోద్యమం...

నిజాం నిరంకుశ పాలన కింద బతుకులీడుస్తున్న ప్రజలను పోరాట బాటలో నడిపించడానికి గ్రంథాలయోద్యమం కూడా ముఖ్యమైంది. అక్షరజ్ఞానం నేర్పి పత్రికా పఠనం ద్వారా ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. 1886లో మందిన ఆదినారాయణ అనే

మిగతా 8లో

## స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం..

- సిరిసిల్ల పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు



పోలీస్ గ్రౌండ్‌లో వేడుకల కోసం ఏర్పాటు చేస్తున్న షామియానా..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

స్వాతంత్ర్య వేడుకలను జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయం వద్ద ఉన్న గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించడానికి గురువారం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లా పోలీస్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య వేడుకలకు షామియానాలు సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 9.30గంటలకు జాతీయ పతాకాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరిస్తారు. 9.32 గంటలకు గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.40 గంటలకు ప్రజలను ఉద్దేశించి ప్రభుత్వ విప్ సందేశం ఇస్తారు. 9.55 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.25 గంటలకు వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తారు. 11.02గంటలకు కార్యక్రమాలు ముగించనున్నారు.

### ఆకట్టుకుంటున్న బురుజులు..

కోనరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒకనాడు రాజాకార్లను ఎదుర్కోవడానికి గ్రామాల్లో నిర్మించిన బురుజులు.. ఆ పోరాటానికి చిహ్నంగా మిగిలాయి.ఇప్పుడు వాటికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు జాతీయ జెండా రంగులను వేసి అందంగా తీర్చిదిద్దారు. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి, ధర్మారం గ్రామాల్లో నిర్మించిన బురుజులు ఆనాటి ఘట్టాలను గుర్తుకు తెస్తున్నాయి.



నిమ్మపల్లిలోని బురుజు..

### జిల్లాలో పలుచోట్ల వర్షం..

సిరిసిల్ల ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో పొరుగు జిల్లాలో భారీ వర్షాలతో ముంచెత్తుతుంటే రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు జోరు వాన కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం వరకు పొడి వాతావరణం ఉండగా, సాయంత్రం వేళ కొన్ని ప్రాంతాల్లో ముసురుతో కూడిన వర్షం మొదలైంది. జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా వరద కాలువ నుంచి నీటిని ఎత్తిపోస్తున్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో 27.55టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 8.084 టీఎంసీలకు చేరుకుంది. 5710 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జిల్లాలోని ఇల్లంతకుంటలో సాయంత్రం 3.8 మిల్లీమీటర్లు, గంభీరావుపేటలో 2.5 మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 1.5 మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డిపేటలో 1.5 మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 1.3 మిల్లీమీటర్లు, తంగళ్ళపల్లిలో 1.0 మిల్లీమీటర్లు, సిరిసిల్లలో 0.5 మిల్లీమీటర్లు, వేములవాడలో 0.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

### గోదాంల వద్ద రైతుల పడిగాపులు..

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో గోదాంల వద్ద రైతులు గురువారం యూరియా బస్తాల కోసం పడిగాపులు కాచారు. ఉదయం చేరుకుని నిరీక్షించారు. రైతులు ఒక్కసారిగా గూమికూడడంతో పోలీసులు చేరుకుని సర్ది చెప్పారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు సకాలంలో యూరియాను అందించి ఇబ్బందులను తీర్చాలని రైతులు కోరారు.

### వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని టీజీపేట జిల్లా నాయకులు వినతిపత్రం అందించారు. గురువారం వేములవాడలో ప్రభుత్వ విప్‌ను మర్యాదపూర్వకంగా టీజీపేట జిల్లా నూతన కార్యవర్గం సభ్యులు కలిసి సన్మానించారు. అనంతరం వినతిపత్రం అందించి సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీజీపేట జిల్లా అధ్యక్షుడు తడుకల సురేష్ మాట్లాడారు. ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో వ్యాయాము ఉపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పాల్గొనే విద్యార్థులకు రవాణా, భోజన ఖర్చులను ప్రభుత్వం ఇచ్చే విధంగా సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతిలో అర్హత కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులందరికి పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు దుప్పటి రవికుమార్, సభ్యులు నరేష్, పరుశురాములు, శ్యాంసుందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కృష్ణ చైతన్య ఇస్కాన్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కల్యాణలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని సిరిసిల్ల ఇంచార్జి శ్రీమాన్ శ్రీప్రాణనాథ అచ్యుతదాస్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న వేడుకలలో రాధకృష్ణుల దర్శనానికి భక్తులందరికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి 108 పదార్థాలతో తయారుచేసిన నైవేద్యాలను సమర్పిస్తామన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు నరుత్తమదాస్, హరిహరదాస్, మధూసూదన్ దాస్, రసానంద ప్రియదాస్ పాల్గొన్నారు.

## మెడికల్ హబ్‌గా తెలంగాణ రాష్ట్రం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మెడికల్‌హబ్‌గా మారిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో 40మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచి ప్రజారోగ్య భద్రతపై ప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. మన ప్రాంతంలో సీఎం సహాయనిధి, ఎల్‌వోసీల ద్వారా ఇప్పటివరకు రూ.22కోట్ల పైచిలుకు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు నాయకులు సంద్రగిరి శ్రీనివాస్, చిలుక రమేష్, నాగుల విష్ణు, గూడూరి మధు తదితరులు ఉన్నారు.

- రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణంలో గురువారం రూ. 4 లక్షల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజి జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, కెసిరెడ్డి నర్సరెడ్డి, తర్రె లింగం, పల్లి గంగాధర్, ఎర్రం రాజలింగం, సూర యాదయ్యగండి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందేలా చర్యలు 8

## భారీ వర్షాల నేపథ్యంలో పటిష్టమైన చర్యలు..

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అల్పపీడనం వల్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల ప్రకారం ఎక్కడ కూడా ప్రాణ, అస్తి నష్టం సంభవించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ సచివాలయం నుంచి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి భారీ వర్షాలపై కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా సమీక్షించారు. అలాగే జిల్లాలో భారీ వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యూరియా నిల్వలపై నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల నుంచి భారీవర్షాలు కొన్ని ప్రాంతాలల్లో కురుస్తున్నాయని వాతావరణ శాఖ సూచనల ప్రకారం వరదల సమయంలో నష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వరద పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి నిత్యం సమీక్షిస్తున్నారని ప్రజలకు ఎక్కడా ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వరద సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లాకు ముందస్తుగా రూ కోటి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, ఆర్డీవో రాధాబాయ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను స్వచ్ఛందంగా తిరిగి ఇవ్వాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారందరు స్వచ్ఛందంగా తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వోజ్జాల అగ్గి రాములు తన భార్య లావణ్య పేరుతో గ్రామశివారులోని సర్వేనంబర్ 61/47లో కబ్జా చేసి సాగు చేసుకుంటున్న 4 ఎకరాల 2గుంటల ప్రభుత్వ భూమికి సంబంధించిన పత్రాలను ఎస్పీ మహేష్ బీ గితే సమక్షంలో గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలెక్టర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే సదరు భూమిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని సూచించారు.

## ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి

● పలువురు విద్యార్థులకు గాయాలు


హర్షవర్ధన్(ఫైల్)

తిమ్మాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెల్లారితే స్వాతంత్ర్య దినోత్స వం, సంతోషంగా ఇంటికి వెళ్లి ఉదయాన్నే జండవందనానికి వెళ్లాలని సంతోషంతో వెళ్తున్న విద్యార్థుల ఆటో కాసేపటిలో ఇంటి చేరుతామనే లోపే అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఓ విద్యార్థి మృతి చెందగా, పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు తిమ్మాపూర్‌లోని ఓ పాఠశాలలకు ఆదే గ్రామానికి చెందిన ఆటోలో వెళ్లి వస్తుంటారు. గురువారం కూడా స్కూల్‌కి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఇంటికి సమీపంలోకి రాగానే విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోకు కుక్క అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడి కొద్ది దూరం వరకు రోడ్డుకు రాసుకుంటూ పోయింది. ఆటోలో కుడి వైపున కూర్చున్న నాంపల్లి హర్షవర్ధన్ (10) నాలుగవతరగతి విద్యార్థి తలనేలకు రాక్కుంటూ వెళ్లింది. స్థానికులు వెంటనే అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు హర్షవర్ధన్ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు నాంపల్లి శ్రీనివాస్, సమత ఆసుపత్రి వద్ద రోదించడం అందరినీ కలిచి వేసింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇతర విద్యార్థుల్లో కొందరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయాలు అలుముకొన్నాయి. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ అనిల్‌ను ఎల్ఎండీ పోలీసులు అదుపులోని తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

## క్షణికావేశంలో పురుగుల మందు తాగి మహిళ బలవన్మరణం


సంధ్య (ఫైల్)

ధర్మారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూతురును ఎందుకు కొడుతున్నావని తల్లి మందలించడంతో క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కటికె నపల్లి గ్రామానికి చెందిన సంపంగి సంధ్య(25) మంగళవారం కూతురు వర్షిత అల్లరి చేస్తుందని కొప్పడుతూ చేయిచేసుకొంది. దీంతో సంధ్య తల్లి మామిడి సత్తమ్మ ఎందుకు కొడుతున్నావని మందలించింది. క్షణికావేశానికి లోనైన సంధ్య పత్తిచేను వద్దకు వెళ్లి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటుఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సంధ్య బుధవారం రాత్రి మృతి చెందింది. సంధ్య తల్లి మామిడి సత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# రేకుర్తి కంటి ఆసుపత్రిలో విస్తృత సేవలు

● మెల్లకన్ను, కంటి క్యాన్సర్‌కు చికిత్సలు

● 26వ తేదీన ప్రారంభం


రేకుర్తి కంటి ఆసుపత్రి

భగత్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మదేకర్ ఉదార రేకుర్తి కంటి ఆసుపత్రిలో విస్తృత సేవలు ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను మినహాయిస్తే ఉత్తర తెలంగాణలో ఏ పట్టణంలో లేని అరుదైన చికిత్సలను రేకుర్తి కంటి ఆసుపత్రిలో ప్రారంభించనున్నారు. ఈ నెల 26వ తేదీన రేకుర్తి కంటి ఆసుపత్రిలో మెల్ల కన్నుతో పాటు, కంటి క్యాన్సర్ చికిత్స కోసం ఓక్యులోప్లాస్టీ చికిత్స లను అందుబాటులోకి తేనున్నారు. ప్రతీనెల ఒకరోజు ఈచికిత్సల కోసం వైద్యులు అందుబాటులో ఉండనున్నారు. దీనితో కంటి సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్లకుండా రేకుర్తిలోనే చికిత్సలు అందించడానికి ఏర్పాట్లు చేశారు.

● మెల్ల కన్నుకు చికిత్స

లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో మెల్లకన్నుకు చికిత్సను ప్రారంభిస్తున్నారు. చిన్న పిల్లల్లో కంటి సమస్యలు, చిన్న పిల్లల్లో శుక్లమ్ (మోతె బిందు) కంటి నరానికి సంబంధించిన చికిత్స కోసం నిపుణులైన వైద్యులు వచ్చి చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

● కంటి క్యాన్సర్, ఓక్యులోప్లాస్టీ చికిత్స

కంటి క్యాన్సర్‌కు సంబంధించి ఓక్యులోప్లాస్టీ చికిత్సను ఈ నెల 26వ తేదీన రేకుర్తిలో చికిత్స అందించనున్నారు. కన్నులో అద్దంలో వలె తళుక్ మొదలవ్వగానే కళ్లలో తేడా తెలుస్తుంది. మెల్లకన్ను లక్షణం ఉంటుంది. కళ్లలో మునుపటి కన్నా చూపు తక్కువవు తుంది. కళ్ల నుంచి నీరుకారుతుంది పొద్దున లేవగానే కళ్లు ఎర్రబడే లక్షణాలు కనిపిస్తాయి. కనురెప్పలు వాటంతట అవే మూసుకు పోతాయి. ప్రోస్టేటిస్ చికిత్స, ఒకకన్ను చిన్నగా కనిపిస్తుంది, రేటినో బ్లాస్టోమాను (ఇది ఒక కంటి క్యాన్సర్ పండు) మొదటి దశలో కనుగొని చికిత్స ప్రారంభిస్తే రోగాన్ని నయం చేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

**అవకాశాన్ని వినియోగించుకోవాలి**

**కొండా వేణుమూర్తి, చైర్మన్ రేకుర్తి కంటి ఆసుపత్రి**



రేకుర్తి కంటి ఆసుపత్రిలో మెల్లకన్ను, ఓక్యాలో ప్లాస్టీ సేవలను రేకుర్తిలో ప్రారంభిస్తున్నాము. కొత్తగా సర్జికల్ రెటినా సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

## సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌కు రాష్ట్రపతి మెరిటోరియస్ అవార్డు


ఎస్ ఆంజనేయరాజు


గోపాల్‌రెడ్డి

జ్యోతినగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగుండం ఎన్టీపీసీ యూనిట్ సెంట్రల్‌ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) డిప్యూటీకమాండెంట్ ఎస్.ఆంజనేయ రాజుకు ప్రతిష్ఠాత్మక ప్రెసిడెంట్ మెరిటోరియస్ సర్వీస్‌మెడల్ లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీపీసీ ప్రాజెక్టులో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌గా పని చేస్తున్న ఆంజనేయరాజు ఉత్తమ సేవలను గుర్తించిన కేంద్రం రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ పతకానికి ఎంపిక చేసింది. ఈ మేరకు గురువారం సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం(ఢిల్లీ) నుంచి సర్క్యులర్ విడుదలైంది. ప్రెసిడెంట్ మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపికైన ఆంజనేయరాజును సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, డిసి ఒవికె.శాస్త్రి, అధికారులు, జవానులు, ఎన్టీపీసీ అధికారులు అభినందించారు.

**రాష్ట్రపతి మెడల్‌కు ఎంపికైన జమ్మికుంట ఫైర్ ఆఫీసర్**

**జమ్మికుంట:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట అగ్నిమాపక కేంద్రంలో పనిచేసే లీడింగ్ ఫైర్ ఆఫీసర్ బి గోపాల్‌రెడ్డి రాష్ట్రపతి మెడల్‌కు ఎంపియ్యారు. ఆయన 33 సంవత్సరాలు ఫైర్‌స్టేషన్‌లో విధుల నిర్వహిస్తున్నాడు. వివిధ అగ్నిప్రమాదాల్లో ఆయన ప్రాణ, ఆస్తి నష్టనివారణలో విశేష సేవలందించారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు గతంలో ఉత్తమ సేవా పతకం అందించింది. ఈసందర్భంగా ఆయనను జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఎం శ్రీనివాస్‌రెడ్డి, జమ్మికుంట అగ్నిమాపక సిబ్బంది అభినందించారు.

## చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి


శ్రీనివాస్(ఫైల్)

జగిత్యాలరూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గర్వంద శ్రీనివాస్(40) అనేడ్రైవర్ గురువారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. శ్రీనివాస్ పలువురి దగ్గర రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతోపాటు అతడిభార్య కవిత ఆరోగ్యం బాగాలేదని తరచూ బాధపడేవాడు. ఈనెల 12న శ్రీనివాస్ లక్ష్మీపూర్ శివారులోని ఆలయ సమీపంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నం చేశాడు. బంధువులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. భార్య కవిత ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌కు చెందిన కన్నెబత్తుల చంద్రయ్య(82) కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం పనినిమిత్తం కట్టరాంపూర్ ఇంటినుంచి మానకొండూర్‌కు తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. బయటు దేరిన కొద్దిసేపటికే మానేరుబ్రిడ్జి నుంచి అలుగు నూర్ వైపువస్తున్న క్రమంలో గుర్తుతెలియనివాహనం చంద్రయ్య ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో చంద్రయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతన్ని 108లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడచికిత్స పొందుతూమృతిచెందాడు. మృతుడు చంద్రయ్య బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై తెలిపారు.

## ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

వీణవంక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన పానుగంటి ప్రమీల(56) వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. పోలీసులువివరాల ప్రకారం.. కొంతకాలంగా కటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రమీల బాత్‌రూమ్‌లోని రాడుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు మృతురాలు ప్రమీల భర్త విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## గల్ఫ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేటకు చెందిన ఎలుకపల్లి అంజయ్య గల్ఫ్‌లో మరణించగా మృతదేహం గురువారం ఇంటికి చేరింది. సౌదీఅరేబియాలో గతనెల24న అంజయ్య మృతి చెందగా 22రోజుల తర్వాత మృతదేహం ఇంటికి చేరింది. సౌదీ అరేబియా నుంచి మృతదేహన్ని ఇంటికి తరలించేందుకు కృషిచేసిన జాడి మల్లేశం, మహ్మద్ అబ్దుల్‌రఫిక్, షేక్ కలీం, మహమ్మద్‌కు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. కాగా గల్ఫ్‌బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గల్ఫ్ జేఏసీ రాష్ట్రకార్యదర్శి బూత్కూరి కాంత డిమాండ్ చేశారు.

## వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పరిధిలోని కొత్తపల్లికి చెందిన కేతిరెడ్డి శ్రీలత ఇంటి ఎదుట గల సీసీ కెమెరాలు, కారు అద్దాలను పగలగొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామనికిచెందిన శ్రీలత సంవత్సర కాలంగా కొత్తపల్లిలో ఉంటోంది. శ్రీలత అన్న మాడ కృష్ణారెడ్డితో ఆస్తులకు సంబంధించిన గొడవలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కోర్టులో కేసులు కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి మాడ కృష్ణారెడ్డి శ్రీలత ఇంటికి వెళ్లి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఇంట్లో ఎవరూలేని సమయంలో తలుపులు బద్దలు కొట్టి యాభై వేయిల రూపాయలు సెల్‌ఫోన్ తీసుకోని ఇంటి ముందు కారు అద్దాలు పగలగొట్టినట్టు శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## పత్తి చేను ధ్వంసం

● పలువురిపై కేసు నమోదు

కోనరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అకారణంగా పత్తి చేను ధ్వంసం చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన మండే ఎల్లయ్య అనే రైతుకు చెందిన సుద్దాల గ్రామ శివారులోని 403 సర్వేనెంబర్‌లో ఎకరం 30 గుంటలు ఉండగా, అందులో పత్తిచేను సాగు చేస్తున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్‌కు చెందిన కుడుకల రాములు, ఎల్లయ్య, మంజుల, మరికొంత మంది పత్తి చేను ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన వారిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

# నమ్మించి క్రెడిట్ కార్డుల డబ్బుల స్వాహా

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు ● వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ నరసింహారావు



నిందితుడి అరెస్టు చూపిస్తున్న హనుమకొండ ఏసీపీ నరసింహారావు

వరంగల్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డుల ద్వారా కమీషన్ తీసుకోకుండా డబ్బులు ఇప్పిస్తానంటూ బాధితుల నుంచి లక్షల్లో డబ్బులు స్వాహాచేసిన మోసగాడిని హనుమకొండ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ మేరకు హనుమకొండ ఏసీపీ నరసింహారావు వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లాజమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన నిందితుడు నేరెళ్ల అరుణ్ 2023వలో హనుమకొండ రాయపురలో భద్రకాళి డిజిటల్ సేవా షాప్‌పెట్టి ఆన్‌లైన్ అప్లికేషన్స్ చేసేవాడు. తరువాత ఇన్‌స్టాముద్ర యాప్‌కి, షాడ్వాల్ పే యాప్‌కి ఫీజు కట్టి డిస్ట్రిబ్యూటర్ ఐడీ తీసుకున్నాడు. తన దగ్గరికి డబ్బు అవసరం నిమిత్తం వచ్చే కస్టమర్ల క్రెడిట్ కార్డు స్వైప్ చేసి వారికి డబ్బులు ఇచ్చేవాడు. దానికి గాను వీసా కార్డుకి 1.8శాతం, మాస్టర్ కార్డుకి 2.6శాతం బిజినెస్ కార్డు 4శాతం, రూపే కార్డుకి 1.8శాతం వారీగా డబ్బులు తీసుకునేవాడు. తన దగ్గరికి తరచుగా వచ్చే కస్టమర్లను తన వ్యాలెట్‌లో యాడ్ చేసుకొని వారి క్రెడిట్ కార్డులలో బ్యాలెన్స్ ఉంటే వారికి ఫోన్ చేసి తాను వేరే పేమెంట్ చేసేది ఉందని చెప్పి.. వారి కార్డులు స్వైప్ చేసి వారికి ఎటువంటి చార్జెస్ లేకుండా తానే వారి క్రెడిట్ కార్డుల బిల్లులు కడతానని వారిని మోసపూరితంగా మాయమాటలుచెప్పి నమ్మించేవాడు. కార్డులు స్వైప్ చేసిన తరువాత వేరే కస్టమర్ల కార్డులు పేమెంట్ చేసి దానికి 4శాతం వరకు చార్జి తీసుకొని లాభపడేవాడు. తరువాత తన బ్యాంకు ఖాతా హోల్డ్ అయ్యిందని, రెండు రోజుల తరువాత ఎటువంటి కమీషన్ లేకుండా వారికి ఇస్తానని నమ్మించి కొన్నిరోజుల తరువాత వారి క్రెడిట్‌కార్డు బిల్లులు కూడా తానే కట్టేవాడు. యేడాదిపాటు వారికి నమ్మకంగా ఉంటూ వారి క్రెడిట్‌కార్డు బిల్లులు కడుతూ క్రెడిట్ కార్డులు స్వైప్ చేస్తూ అలా బాధితుల డబ్బుల నుంచి తన క్రాప్‌లోన్, అప్పులు కట్టి తన కుటుంబసభ్యులకు కూడా డబ్బులు సర్దుబాటు చేసేవాడు. అలా కస్టమర్ల క్రెడిట్ కార్డుల నుంచి సుమారుగా సుమారుగా రూ.28లక్షలు వాడుకున్నాడు. కస్టమర్లు ఫోన్‌చేయడంతో వారికి రేపుమాపు అంటూ దాటవేస్తూ వచ్చాడు. ఆ తరువాత తనవల్ల కాకపోవడంతో కొన్నిరోజులు ఎటైనా వెళ్లిపోతే కస్టమర్లు మర్చిపోతారనుకున్నాడు. తనువేసుకున్న పథకం ప్రకారం షాప్‌మూసేసి విజయవాడకు వెళ్లాడు. గురువారం షాపు వద్దకు వచ్చి ఖాళీచేస్తుండగా పోలీసులు నిందితుడుని పట్టుకొని అదుపులోకి తీసుకొనివిచారించగా తన నేరాన్ని అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన హనుమకొండ పోలీస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ఇల్లంతకుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరులో ఎరువుల విక్రయకేంద్రాలపై కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో గురువారం గ్రామంలోని నాలుగు ప్రైవేట్‌ఎరువుల దుకాణాలతో పాటు డీసీఎంస్ కేంద్రాలను తనిఖీలు చేశారు. తనిఖీలలో ఈపాస్ గ్రౌండ్ బ్యాలెన్స్ స్టాకులకు సరిపోని ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశారు. అనుమతిలేని గోదాములలో నిలువ ఉంచిన రూ 19,71,514 విలువైన యూరియా, డీఏపీ తదితర రసాయనిక ఎరువులను సీజ్‌చేశారు. మండలంలో యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. తనిఖీలలో విజిలెన్స్ తహసీల్దార్ దినేష్‌చంద్రారెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు అనీల్‌కుమార్, వరుణ్‌ప్రసాద్, మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన సంపత్ (35) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 10న బొంపల్లి గ్రామ శివారులో కారు ఢీకొనగా సంపత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి సోదరి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

### పురుగుల మందు తాగిన వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి చికిత్సపొందుతూ ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని మల్యాల గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు వివరాల మేరకు ఉల్లి శ్రీనివాస్(40) మద్యానికి బానిసయ్యాడు. బుధవారం అతిగా మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య కోమల మద్యం తాగవద్దని సూచించింది. దీంతో మద్యం మత్తులో ఉన్న ఆయన ఇంటిలోని గడ్డి మందుతాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం శ్రీనివాస్ మృతిచెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మంథని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గంగాపురి క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిట్టం వెంకటేష్ (30) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన వెంకటేష్ మరోముగ్గురు స్నేహితులతో కలిసి మంథనికి వచ్చి తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి ఎగిరి కిందపడిన వెంకటేష్‌పై నుంచి లారీ వెనుక టైర్ వెళ్ళడంతో తల నుజ్జునుజ్జయి అక్కడిక్కడే మృతిచెందాడు. మంథని మండలం ధర్మారం గ్రామానికిచెందిన తిప్పాని అభిలాష్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం గోదావరిఖనికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు. వెంకటేష్ మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి తల్లి సుగుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుభాష్ నగర్‌కుచెందిన రెండ్లపద్మ ఆగస్టు12న తన మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా కరీంనగర్ రూరల్ పోలీషులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ రూరల్ పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా వరంగల్‌లో ఉన్నట్లు గుర్తించి, దానినిస్వాధీనం చేసుకున్నారు. గురువారం రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి పద్మకు ఫోన్‌ను అప్పగించారు. కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.

# ఏఎంసీ గోదాంలో అదుపులోకి వచ్చిన మంటలు

● ఐదు రోజులు రాత్రింబవళ్లు శ్రమించిన అధికారులు


మెట్‌పల్లి ఏఎంసీ గోదాంలో అదుపులోకి వచ్చిన మంటలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలోని గోదాంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో చెలరేగిన మంటలు గురువారం అదుపులోకి వచ్చాయి. రెండు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంలో ఉన్న గోనె సంచులు దగ్ధం కాగా గోదాం పూర్తిగా దెబ్బతింది. ఐదు రోజుల నుంచి మెట్‌పల్లి, జగిత్యాల, నిర్మల్, భీంగల్, ఖానాపూర్ అగ్నిమాపక కేంద్రాల నుంచి మంటలు ఆర్పడానికి వాహనాలను రప్పించారు. అగ్ని ప్రమాదంలో మంటలు చెలరేగడంతో గోదాం చుట్టూ ఉన్న గోడలు ధ్వంసం చేసి పై భాగంలోని రేకులను తొలగించారు. ఎక్స్‌కవేటర్లతో కాలుతున్న గోనె సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేసి మళ్లీ మంటలు రాకుండా వాటిని ఇసుకతో కప్పివేశారు. ఆరు అగ్నిమాపక యంత్రాలు, పోలీస్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది ఐదు రోజుల పాటు రాత్రింబవళ్లు శ్రమించి మంటలు అదుపు చేశారు. 2018 సంవత్సరం నుంచి మార్కెట్‌యార్డు గోదాంను సివిల్ సప్లయిస్ శాఖ వారు అద్దెకు తీసుకొని అందులో గోనె సంచులను నిల్వ చేస్తున్నారు. అందులో ఉన్న 9.70లక్షల సంచులు కాలిపోవడంతో రూ.97లక్షలు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. అదేవిధంగా గోదాం దెబ్బతిని మరో రూ.70లక్షల వరకు ఆస్తి నష్టం నష్టం వచ్చిందన్నారు. గోనె సంచులు, గోదాంలకు ఇన్సూరెన్స్ ఉందని, సంబంధిత అధికారులు పరిశీలించినట్లు సివిల్‌సప్లయిస్, మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు. ప్రమాదంపై సివిల్‌సప్లయిస్, మార్కెట్ కమిటీ శాఖ వారు వేర్వేరుగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. గోదాంలో మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని తహసీల్దార్ నీత తెలిపారు. మంటలను ఆర్పే కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ కూన గోవర్దన్, తహసీల్దార్ నీత, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్, ఎస్సై కిరణ్‌కుమార్, గోదాం ఇన్‌చార్జి సురేష్, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలు

వేములవాడ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భూమి తగాదాలలో కక్ష పెంచకుని ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ వేములవాడ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ గురువారం తీర్పునిచ్చారు. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రగిరి గ్రామానికి చెందిన ముత్త ఎల్లయ్యకు గ్రామశివారులో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో ఎల్లయ్య భార్య వెంకటలక్ష్మి, కుమారుడు శరత్‌కుమార్‌లు వ్యవసాయం చేసకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన దేశవేణి లింగయ్యకు చెందిన భూమి మల్లయ్యకు చెందిన భూమిని ఆనుకుని ఉన్నది. హద్దుల విషయంలో కొంత కాలంగా గొడవలు జరుగుతుండగా పలుమార్లు పంచాయతీలు నిర్వహించినా పరిష్కారం లభించలేదు. ఈ తగాదాలు తొలగాలంటే ఎల్లయ్య కుటుంబాన్ని హత్య చేయాలని దేశవేని లింగయ్య, కనుకవ్వ, కనుకరాజు, శ్రీనివాస్ సరోజన, చొక్కాల తిరుమలు పథకం వేశారు. దీంతో 2020 డిసెంబరు 25వ తేదిన ఎల్లయ్య కుమారుడు శరత్‌కుమార్ తనపొలంలో ఒంటరిగా పనిచేస్తున్నాడని తెలుసుకున్న సదరు వ్యక్తులు పార, కర్రలు, రాళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటనపై తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి సీఐ వెంకటేష్ దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజిరెడ్డి కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి నిందితులు ఆరుగురికి ఐదు సంవత్సరాల జైలుశిక్ష, ఐదు వందల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రాసిక్యూషన్‌ను, దర్యాప్తు అధికారులను సీఎంఎస్ పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ పేర్కొన్నారు.

# తీరొక్క దేశాల నాణేలు

● 180దేశాల 1100నాణేలు, కరెన్సీల సేకరణ ● గిన్నీస్ రికార్డు లక్ష్యం ● గర్షకుర్తికి చెందిన మిట్టపల్లి నవీన్‌కుమార్



వివిధ దేశాల నాణేలు, సేకరించిన ఇతర దేశాల కరెన్సీతో నవీన్‌కుమార్

గంగాధర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన మిట్టపల్లి నవీన్‌కుమార్ 180 దేశాల 1100నాణేలు, కరెన్సీలను సేకరించి తనకంటూ గుర్తింపును సంపాదించుకున్నారు. 180దేశాలకు చెందిన 1100పాత, కొత్తరకాల నాణేలు, కరెన్సీలను సేరించాడు. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించాలని కోరి ఎంతటి కష్టమైన సేకరించాలని ప్రయత్నించి సఫలీకృతుడయ్యాడు. ఒకప్పటి రాజుల కాలం నాటి, బ్రిటీష్ కాలం నాటి చెల్లుబాటులో ఉన్న బిల్లలు, ప్రస్తుతం చెలామణిలో ఉన్న నాణేలతో పాటు కరెన్సీలను సంపాదించాడు. ఆయన సేకరించిన దేశాల్లో అమెరికా, దుబాయ్, లండన్, జపాన్, సింగపూర్ వంటి దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీ ఉన్నాయి. ఆయన 20సంవత్సరాలుగా వీటిని సేకరిస్తున్నాడు. ఈ కరెన్సీలు, నాణేల సేకరణలో తన స్నేహితుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నాడు. అయితే ఒక హాబీగా సేకరించిన ఈ నాణేలతో గిన్నీస్ రికార్డుగా నెలకొల్పాలన్నదే తన లక్ష్యమని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

# పాఠశాలల్లో ఆధార్ నవీకరణ

## విద్యార్థులకు ఎంతో సౌలభ్యం



విద్యార్థులకు ఆధార్ నవీకరణ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

కరీంనగర్ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆధార్ వివరాల్లో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా కరీంనగర్ రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఆధార్ నవీకరణ సాగుతోంది. పాఠశాలల్లోనే కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. కొంత మందికి ఆధార్ కార్డు లేక పోవడం, ఉన్నా అందులోని వివరాలు, పాఠశాలలో నమోదైనా వివరాలకు పొంతన లేకపోవడం వంటి పరిణామాలతో సమస్యలు తలెత్తాయి.

దీంతో యూడైస్‌లో నమోదుకు విద్యాశాఖ అధికారులు గందరగోళానికి గురవుతున్నారు. యూడైస్‌లో నమోదు చేసిన వారికే ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏక రూపదుస్తులు, రవాణా భత్యం, మధ్యాహ్న భోజనం వంటి వసతులు సమకూరుతాయి. ఈ నేపథ్యంలో ఆయా సమస్యలను అధిగమించడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో అప్‌డేట్ ప్రక్రియ చేపట్టారు. ఆధార్ నవీకరణతోపాటు కొత్తగా నమోదు చేసుకోవచ్చు. మండలానికి ఒకరిని నియమించి ప్రతీ పాఠశాలకు వెళ్లేలా కార్యచరణ రూపొందించి అమలు చేస్తున్నారు.

గతంలోనూ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ఆధార్ అప్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించింది. ప్రైవేటు పాఠశాలల్లో కూడా యూడైస్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు ఉన్నాయి.

పాఠశాలల్లో ఆధార్ ప్రక్రియలో భాగంగా 2019-20 విద్యాసంవత్సరంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్లకు ఆధార్ నమోదు కిట్లను అందించినట్లు అధికారులు తెలిపారు. కరోనా ప్రభావంతో రెండేళ్లు ఈ కార్యక్రమం నిలిచిపోయిందని, 2023-24 విద్యాసంవత్సరంలో తిరిగి చేపట్టగా మండల వనరుల కేంద్రాల నిర్వాహకులకు ఈ బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. గతేడాది నుంచి ప్రైవేటు ఏజెన్సీలకు ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.




# నిత్య జనగణమనకు ఎనిమిదేళ్లు..



జమ్మికుంట ప్రధాన కూడలిలో జాతీయగీతం ఆలపిస్తున్న ప్రజలు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో నిత్య జనగణమన ప్రారంభించి నేటికి ఎనిమిదేళ్లు పూర్తైంది. 2017ఆగస్టు 15న అప్పటి సీఐ పింగిలి ప్రశాంత్‌రెడ్డి నిత్య జనగణమన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు, మైక్ సెట్లు ఏర్పాటు చేశారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు అను సంధానం చేశారు. ప్రతిరోజు ఉదయం 7.30గంటల నుంచి దేశభక్తి గీతాలు వేస్తారు. 30 నిమిషాల పాటు దేశభక్తి గీతాలు వేసిన తర్వాత సరిగ్గా 8 గంటలకు జాతీయ గీతం ప్రారంభిస్తారు. ఆ సమయంలో ఎక్కడివారు అక్కడే నిలబడి జాతీయ జెండాకు వందనం చేస్తూ జనగణ మన ఆలపిస్తారు. ఎనిమిదేళ్లుగా జాతీయ గీతాన్ని ఆలపించడం సంతోషంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. దేశాన్ని గౌరవించుకోవడం మంచి విషయమని, ఇతర ప్రాంతాల వాసులు జమ్మికుంటను స్ఫూర్తిగా తీసుకొని నిత్య జనగణమన ప్రారంభించారు.



పాల్గొన్న నాయకులు, పోలీసు అధికారులు

### స్ఫూర్తిగా తీసుకోవడం గొప్ప విషయం

**ఎస్ రామకృష్ణగౌడ్, పట్టణ సీఐ**

జమ్మికుంటను స్ఫూర్తిగా తీసుకొని ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో నిత్య జనగణమన నిర్వహించడం గొప్ప విషయం. ప్రతిరోజు ఉదయం 7.30గంటలకు పోలీస్‌స్టేషన్ నుంచి దేశభక్తి గీతాలు వినిపిస్తాం. సరిగ్గా 8గంటలకు జాతీయ గీతం ప్రారంభిస్తాం. ఆ సమయానికి ప్రజలందరూ ఎక్కడి వారు అక్కడే నిలబడి జాతీయ జెండాకు వందనం చేస్తూ జాతీయగీతం ఆలపిస్తారు. ఇక్కడి వారిని చూసి ఇతర ప్రాంతాల వారు సైతం దేశభక్తిని అలవరుచుకోవడం సంతోషంగా ఉంది.

# కొనసాగుతున్న ఎత్తిపోతలు



గురువారం నాలుగు సిస్టర్న్స్ ద్వారా వెలువడుతున్న నీరు

ధర్మారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గోదావరిలోకి వరద నీరు పోటెత్తుతుండంతో నందిమేడారంలోని నంది పంప్‌హౌజ్ నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గోదావరి ఎగువప్రాంతాల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి 9848 క్యూసెక్కుల వరద నీరు వస్తుండంతో ప్రాజెక్ట్ నుంచి నందిమేడారం పంపుహౌజ్‌కు 9450 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. బుధవారం మూడు మోటార్లు ఆన్‌చేసి 9450క్యూసెక్కుల నీటినిఎత్తిపోసిన అధికారులు, గురువారం ఉదయంనుంచి మధ్యహ్నం వరకు 4మోటార్లు రన్‌చేసి నీటిని ఎగువకుతరలిస్తున్నారు. నీటినిల్వలకు అనుకూలంగా సాయంత్రం నుంచి 3మోటార్ల ద్వారానే ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌నీటిసామర్థ్యం20.175 టీఎంసీలు కాగా గురువారం వరకు 15.706 టీఎంసీలకు చేరుకుంది.

### గాయత్రి పంపుహౌస్ కొనసాగుతున్న నీటి విడుదల

- మూడు పంపులతో 9450 క్యూసెక్కుల నీరు ఎస్సారార్ డ్యాంకు తరలింపు

**రామడుగు:** రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి మిడ్ మానేరు డ్యాంకు నీటి విడుదల కొనసాగుతంది. బుధవారం మూడు పంపుల ద్వారా నీటి విడుదల ప్రారంభమైన విషయం విదితమే. గురువారం కూడా మూడుపంపుల ద్వారా నీటివిడుదలను కొనసాగిస్తున్నారు.

డెలివరి సిస్టమ్ నుంచి గ్రావిటీ కెనాల్‌నీటిని పంపించిన నీరు అక్కడినుంచి నేరుగా వరదకాలువ ద్వారా శ్రీరాజరాజేశ్వరడ్యాంకు పరవళ్లుతొక్కుతూ నీరు ప్రవహిస్తుంది. మూడు పంపులు ఒకేసారి విడుదల చేయడంతో వరద కాలువ నిండుగా ప్రవహించడంతో రైతుల కళ్లలో ఆనందం కదలాడుతుంది. ఒక్కో పంపు 3150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈనేపథ్యంలో మూడుపంపుల ద్వారా(0.29 టీఎంసీల) 9450 క్యూసెక్కుల నీటిని ఎస్సారార్ డ్యాంకు తరలిస్తున్నారు.

### వరద కాలువ ఆయకట్టు రైతుల ఆనందం

**గంగాధర:** వరద కాలువకు నీరు విడుదలతో గంగాధర మండల పరిధిలోని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గాయంత్రి పంపు హౌస్ నుంచి మూడు పంపుల ద్వారా రోజుకు ఒక్కొక్క పంపు నుంచి 3350 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. వరదకాలువ నుంచి రెండు రోజులుగా 10వేల క్యూసెక్కుల నీరు మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. దీంతో వరదకాలువ ఆయకట్టు మండల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, కురిక్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, గర్షకుర్తి, గట్టుబూత్కూర్, ఆచంపల్లి గ్రామాల వ్యవసాయ పంటలకు వరద కాలువ నీరు వినియోగించుకోవచ్చు. వరద కాలువలో నీరుండటంతో భూగర్భ జలాలు పెరగనున్నాయి. ప్రస్తుతం ఈ సీజన్‌లో ఇప్పటి వరకు వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో వరదకాలువకు అధికారులు నీరు విడుదల చేస్తుండగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి



నగరంలో మహిళలతో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

భగత్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని కోతిరాంపూర్, కట్టరాంపూర్ కాలనీలలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా స్థానిక సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కోతిరాంపూర్, కట్టరాంపూర్, ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట రోడ్డుపైన అనేక గుంతలు ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మహిళలకు నెలకు 2,500రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. మహిళా సమస్యలు పరిష్కరించకపోతే అందరిని ఐక్యంచేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధానకార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు ద్యావ అన్నపూర్ణ, గుడికందుల సంధ్య, మంచినీళ్ల లావణ్య, ఉప్పునూటి లక్ష్మి, స్రవంతి, భవాని, రజని, మున్నా, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పీడ్ గన్

- వాహనాల వేగం 80దాటితే చాలన్ పడ్డట్టే



స్పీడ్‌గన్‌ను పరిశీలిస్తున్న సీఐ సదన్ కుమార్, ఎస్సై శ్రీకాంత్ గౌడ్

తిమ్మాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజీవ్ రహదారిపై గురువారం తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ కలిసి స్పీడ్ గన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కొసమే స్పీడ్ గన్ ఏర్పాటు చేశామని తెలిపారు. వాహనాల వేగం 80దాటితే చాలన్ పడుతుందని తెలిపారు. గురువారం మొదటి రోజు అతివేగంగా వెళుతున్న సుమారు 20వాహనాలకు స్పీడ్‌గన్ ద్వారా చాలన్‌లు పడినట్లు తెలిపారు. వాహనాదారులు వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని తెలిపారు.

# గిరిజన తండాల్లో తీజ్ సంబరాలు



కోనరావుపేట గిరిజన తండాలో తీజ్ ఉత్సవాల్లో యువతులు

కోనరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల బతుకమ్మగా కొలిచే తీజ్ ఉత్సవాలను గిరిజన తండాల్లో గురువారం ఉత్సాహంగా జరుపుకున్నారు. యువతుల, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రతిసంవత్సరం శ్రావణమాసంలో గిరిజనతండాల్లో మహిళలు తీజ్ ఉత్సవాలను జరుపుకుంటారు. గోధుమలను నానపోసి నారుగా పెరిగిన తర్వాత తొమ్మిదిరోజులపాటు ఉపవాసదీక్షలు యువతులు, మహిళలు చేసి కుటుంబసభ్యులు, పంటలు బాగుండాలని వేడుకొని మహిళలు గోధుమ నారును నెత్తిన పెట్టుకొని ఆయా చెరువులో నిమజ్జనం చేశారు.

**గంభీరావుపేట:** మండలంలోనిలింగన్నపేట తండాలో గురువారం తీజ్‌ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గోదుమనారుతో చేసిన బతుకమ్మలను సంప్రదాయ నృత్యాలతో తీసుకెళ్లి సమీప చెరువుల్లో నిమజనం చేశారు.

**మల్లాపూర్ :** మల్లాపూర్ మండల కేంద్రంలోని బంజారాలు భక్తిశ్రద్ధలతో తీజ్‌పండగను ఘనంగా జరుపుకున్నారు. గురువారం మల్లాపూర్ గ్రామశివారులో ప్రత్యేకపూజలు జరిపి వేడుకలు నిర్వహించారు. బంజారాలు తమసంప్రదాయం ప్రకారం ప్రత్యేకబుట్టలో గోధుమలనువేసి నిత్యం ఉదయం, సాయంత్రం తొమ్మిదిరోజులపాటు నీళ్లపోసి పెంచారు. వాటిని అలంకరించిన బుట్టలో ఏర్పాటుచేసుకుని నెత్తినపెట్టుకొని సంప్రదాయ బద్ధంగా మహిళలు, యువతులు నృత్యాలుచేస్తూ చెరువులు, కుంటల వద్దకు వెళ్లారు. అక్కడ ప్రత్యేకపూజలు చేసి నిమజ్జనం చేశారు.



లింగన్నపేటలో తీజ్ ఉత్సవాల్లో మహిళలు



మల్లాపూర్‌లోని తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజన యువతులు, బాలికలు

# భూ సేకరణ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్ల కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా మీదుగా వెళుతున్న జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ వేగవంతం చేయాలని, భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. భారత జాతీయ రహదారి సంస్థ ప్రాజెక్ట్ సంచాలకులు దుర్గాప్రసాద్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్ బాబుతో కలెక్టర్ పమేలా సత్పతి భూసేకరణ సమస్యలపై సమావేశం నిర్వహించారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను గురించి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇదివరకే పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని త్వరగా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. సేకరణ విషయంలో అభ్యంతరాలు ఉన్న వారితో మాట్లాడి సేకరణకు సహకరించేలా చూడాలని అన్నారు. భూసేకరణలో ఉన్న సమస్యలన్నింటిని త్వరగా పరిష్కరించి జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని భారత జాతీయ రహదారి సంస్థకు స్వాధీనం చేయాలని సూచించారు.

## పెన్సిల్ మొనపై త్రివర్ణ పతాకం



పెన్సిల్ మొనపై జాతీయ పతాకం

ఓదెల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడక గ్రామానికిచెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ 79వస్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పెన్సిల్ గ్రాఫైట్‌పై జాతీయజెండాను తయారుచేశారు. సుమారు గంట పాటు శ్రమించి నాలుగు మిల్లీమీటర్ల ఎత్తు రెండు మిల్లీమీటర్ల వెడల్పుఉన్న జాతీయ జెండాను తయారు చేశారు.

గతంలో చాక్‌పీస్‌పై 7 మిల్లీమీటర్ల ఎత్తు5మీ.మీ. వెడల్పుఉన్న జాతీయ జెండాను చెక్కి రంగులు అద్దారు. చాక్‌పీసులపై హ్యాపీఇండిపెండెన్స్‌డే ఆంగ్లఅక్షరాలను 6మిల్లీమీటర్ల ఎత్తు 5మిల్లీమీటర్ల వెడల్పుతో గుండు పిన్ను సహాయంతో చెక్కారు. రజనీకాంత్ ఇంతకుముందు చాక్‌పీస్‌పై జాతీయ గీతం జనగణమన 278 అక్షరాలను, జాతీయ గేయం వందేమాతరం 284 ఆంగ్ల అక్షరాలను చాక్ పీస్, బియ్యపు గింజలపై రాశారు. అదేవిధంగా 1.5సెంటీమీటర్ ఎత్తు ఉన్న చాక్‌పీస్‌లపై 78జాతీయ జెండాలను తయారు చేశాడు. అదే విధంగా ఒకేచాక్‌పీసు పైరెండు మిల్లీమీటర్ల ఎత్తులో 78త్రివర్ణ పతాకాలను చెక్కారు. ఈ పెన్సిల్ గ్రాఫైట్ జాతీయజెండాను ప్రపంచంలోని వివిధ బుక్‌ఆఫ్‌రికార్డులకు ప్రతిపాదనలుపంపినట్లురజనీకాంత్ తెలిపారు.

## సూక్ష్మ కళాకారుడి ప్రతిభ

- గుండు పిన్ను మొనపై జాతీయ జెండాతో పరుగెడుతున్న మహిళ విగ్రహం



గుండు పిన్నుపై జాతీయ పతాకం

జగిత్యాల క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీనగర్‌కు చెందిన డాక్టర్ గుర్రం దయాకర్ అనే సూక్ష్మకళాకారుడు తన ప్రతిభను చాటాడు. స్వాతంత్ర్య పర్వదినాన్ని పురస్కరించుకుని అత్యంత సూక్ష్మవిగ్రహం తయారు చేసి అబ్బురపరిచాడు. గుండుపిన్ను మొనపై జాతీయ జెండాను చేతితో పట్టుకుని పరుగెడుతున్న మహిళ సూక్ష్మ విగ్రహాన్ని తయారు చేశాడు. 10 గంటల సమయంలో మైనంతో పాటు పెన్సిల్ కలర్లు, గుండు పిన్ను ఉపయోగించి ఈ విగ్రహాన్ని తయారు చేసినట్లు సూక్ష్మ కళాకారుడు దయాకర్ తెలిపాడు.

## బీసీ సంక్షేమ సంఘం నాయకుడి నిరసన

గణేశ్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లేక మూతబడ్డ పాఠశాల స్థాయి బీసీ వసతి గృహాన్ని కళాశాల స్థాయి వసతి గృహంగా మార్చాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ప్లకార్డ్ పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలో గల పాఠశాల స్థాయి బీసీ బాలికల వసతి గృహాన్ని విద్యార్థులు లేరని మూసి వేశారన్నారు. సంరక్షణ అధికారిని ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై పంపారన్నారు. అధికారులు మూసివేసిన వసతి గృహాన్ని బీసీ బాలికల కళాశాల వసతి గృహంగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో..

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాసాగర్ ప్రాజెక్టులోకి గురువారం ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఎస్సారెస్పీలోకి 13,540 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. వానాకాలం పంటల సాగు కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను గురువారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,500 క్యూసె క్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 45.758 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిషన్‌భగీరథ, సాగునీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,088 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 600క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 75క్యూసెక్కులు, అల్లీసాగర్ ఎత్తిపోతల పథకానికి 180క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 502క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్1వతేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 40.850 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 8.003 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.



శ్రీరాంసాగర్ ప్రాజెకు

# ఎగువ మానేరు జలాశయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

- ప్రస్తుత నీటి నిలువ, ఇన్‌ఫ్లో తదితర అంశాలపై ఆరా..



ఎగువ మానేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గంభీరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు జలాశయాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి గురువారం సాయంత్రం పరిశీలించారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో మానేరు ప్రాజెక్టును పరిశీలించి, ప్రస్తుత నీటినిలువ, ఇన్‌ఫ్లో తదితర అంశాలపై కలెక్టర్, ఎస్పీ ఆరాతీశారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం, నిలువ ఎంత, ఇన్‌ఫ్లో ఎంత అని నీటి పారుదలశాఖ అధికారుల నుంచి ఆరాతీశారు. ప్రాజెక్టు నీటిమట్టం 2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.3 టీఎంసీల నీరు ఉన్నాయని, ఎగువ నుంచి 400 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుందని, అధికారులు కలెక్టర్, దృష్టికి తీసుకెళ్ళారు. వరద ఇలాగే కొనసాగితే 10రోజుల్లో జలాశయం పూర్తిగా నిండుతుందని వారు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 13వేల ఎకరాలకుపైగా సాగునీరు అందిస్తుందని, ఎడమ కాలువ కింద 700 ఎకరాలు, కుడి కాలువ కింద 12వేల ఎకరాలు సాగవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ డ్యాం గేట్లను పరిశీలించి, వాటి నిర్వహణను దగ్గరుండి పర్యవేక్షించారు. భారీవర్షాల నేపథ్యంలో నీటి పారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు సమయంతో అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు నీటి మట్ట అంచనా వేస్తూ జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. డ్యాం పూర్తిగా నిండితే ఎక్కువైతే నీటిని కాలువల ద్వారా విడుదల చేయాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారి కిషోర్‌కుమార్, ఈఈ ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్ మారుతిరెడ్డి తదితరులు ఉన్నారు.

## బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందేలా చర్యలు

**- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా**



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బీడీ కార్మికుల పిల్లలందరికి స్కాలర్‌షిప్‌లు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జాతీయ స్కాలర్‌షిప్ పథకం కింద బీడీ కార్మికుల పిల్లలందరికి అందించే స్కాలర్‌షిప్‌లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర కార్మిక శాఖ ద్వారా బీడీ, ఇతర కార్మికుల పిల్లలందరికి స్కాలర్‌షిప్‌లు చెల్లించడం జరుగుతుందన్నారు. సిరిసిల్ల జిల్లా పరిధిలో బీడీ కార్మికుల పిల్లలందరికి స్కాలర్‌షిప్‌లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. 1నుంచి 10 వతరగతి చదివే విద్యార్థులు ఈనెల 31లోపు ఇంటర్‌పై చదువులు చదివే పిల్లలకు అక్టోబర్ 31లోపు స్కాలర్‌షిప్ దరఖాస్తులు అందించాలన్నారు. జిల్లాలో బీడీ కార్మికుల పిల్లలందరూ ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు ఈనెల 31లోపు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హత గల బీడీ కార్మికుల పిల్లలందరూ జాతీయ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కేంద్ర ఉప సంక్షేమ కమిషనర్ సాగర్, ప్రధాన్ సీనియర్ మెడికల్ అధికారులు, కేంద్ర సంక్షేమ ఆసుపత్రి డాక్టర్ మహేందేర్, డాక్టర్ మధుకర్, డాక్టర్ వెంటేష్, అసిస్టెంట్ లేబర్ అధికారి నజీర్ అహ్మద్, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫీద్దీన్, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ఇల్లంతకుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. దాచారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండలకేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్, శ్రీవాణి తదితర పాఠశాలలో గురువారం విద్యార్థులు గోపికలు, కృష్ణుని వేషదారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టికొట్టె కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చందుర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల బాలికలు శ్రీకృష్ణ, గోపికల వేషధారణ, ఉట్టికొట్టే కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి ఎల్లంపల్లి మూల వాగు ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి గురువారం సాయంత్రం వరకు 3443 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. గాయత్రి పంప్ హౌస్ నుంచి 3 వేల క్యూసెక్కులు, మూలవాగు, మానేరువాగు ద్వారా 443 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోందని ప్రాజెక్ట్ డీఈ రాజు పేర్కొన్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 307.69, నీటినిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 8.205 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉందని తెలిపారు.

## దవాఖాన రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా..?



మండల కేంద్రంలోని పల్లె దవాఖానకు వెళ్లే దారి..

ఇల్లంతకుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని పల్లె దవాఖానకు వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డు పూర్తిగా చెడిపోయింది. ఇప్పటికే ఆసుపత్రికి సరైన మార్గం లేక ఇబ్బందులు కలుగుతుంటే చిన్నవర్షం పడినా ఆసుపత్రిలోకి వెళ్ళడానికి సిబ్బంది, రోగులు నానా పాట్లు పడుతున్నారు. చెడిపోయిన రోడ్డును బీజేపీ నాయకులు గురువారం పరిశీలించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్ మాట్లాడుతు అనేక మంది రోగులు ప్రతిరోజు ఆసుపత్రికి వస్తుంటారని, ఇలాంటి రోడ్డును బాగుచేస్తామనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు. ప్రాణాలు కాపాడే ఆసుపత్రికి వెళ్ళడానికి రోడ్డు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని కోరారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట ప్రభుత్వ దవాఖాన దారి అధ్వానంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లే దారి బురద గుంతలతో దర్శనమిస్తోంది. ఆసుపత్రికి అతి సమీపంలో కూడా గుంత ఉంది. అనారోగ్యాలతో నిత్యం వెళ్లే రోగులకు ఆసుపత్రి దారి ఇబ్బంది తీవ్రకలిగిస్తోంది. ఆసుపత్రి వెళ్లే దారిని బాగుచేయాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరారు.



ఆసుపత్రి వెళ్లే దారి..

## విష ప్రచారాలను రైతులు నమ్మవద్దు

**- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి**

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అధికారం కోల్పోయిన పార్టీ చేస్తున్న విష ప్రచారాలను రైతులు నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. అధికారం కోల్పోయిన పార్టీకి చెందిన కొంత మంది జిల్లాలో పనిగట్టుకొని యూరియా కొరత ఉందని పుకారు పుట్టించి ధర్నాలు చేయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి కావల్సిన యూరియా అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉందన్నారు. తెలంగాణకు దాదాపు 50లక్షల మెట్రిక్ టన్నుల యూరియాకు కేవలం 36 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చిందన్నారు. ఆగస్టు చివరి వరకు జిల్లాకు 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని దాదాపు ఇప్పటి వరకు 13 వేల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశారన్నారు. జిల్లాలో గత సంవత్సరం జూలై 26వరకు ప్యాడీ వేసింది 70వేల ఎకరాలు ఈసంవత్సరం 135989 ఎకరాలకు ప్యాడీ వేశారన్నారు. గత సంవత్సరం 93814ఎకరాల కాటన్ వేయగా ఈ సంవత్సరం 105994 ఎకరాలలో కాటన్ వేశారన్నారు. కంది 3875 ఎకరాలు వేయగా ఈ సంవత్సరం 5490 ఎకరాలు కంది వేశారన్నారు. గత సంవత్సరం మక్క 20111 ఎకరాలు వేస్తే ఈసంవత్సరం 25396 ఎకరాలు మక్క వేశారన్నారు. జిల్లాలో గత సంవత్సరం జులై వరకు మొత్తం 187940 ఎకరాలలో వివిధ పంటలను వేశారన్నారు. అవసరాలను అనుగుణంగా జిల్లాలో యంత్రాంగం ఎక్కడ అవసరం ఉంటే అక్కడ యూరియా పంపిణీ చేస్తుందన్నారు. కొంత మంది ప్రభుత్వంపై బురుద జల్లే ప్రయత్నంలో భాగంగా యూరియా కొరత ఉందని కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రైతులు భయాందోళనలకు గురికావద్దని అందరికి యూరియా అందుబాటులో ఉంటుందని, ఇబ్బందులుంటే కలెక్టర్, వ్యవసాయ అధికారులు, పార్టీ నాయకుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో గ్రంథాలయం సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కో కన్వీనర్ కనిమేని చక్రధర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మార్కెట్ కమిటి డైరెక్టర్ ఎండీ ఖాజా, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ స్మృతులు..

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయుడు విశాఖపట్నంలో మొదట గ్రంథాలయాన్ని స్థాపించాడు. కరీంనగర్ జిల్లాలో ప్రథమంగా 1922లో బస్వేశ్వర్‌రావు, వెంకట్రామారావులు, శ్రీవిశేశ్వర భాషా నిలయం పేరిట గ్రంథాలయ ఉద్యమానికి నాంది పలికారు. 1925లో సిరిసిల్లలో శ్రీ నారాయాంధ్ర భాషా నిలయం స్థాపించారు. ఖాదీ ఉద్యమంలో మహాత్మాగాంధీ పిలుపు మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సాగినా చెరఖా సంఘం కార్యక్రమాల్లోనూ నేత కార్మికులు భాగస్వాములు అయ్యారు.

### నెత్తుటి గడ్డ... మానాల...

బ్రిటీష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం వచ్చినా నిజాం సర్కార్ ఇండియన్ యూనియన్‌లో విలీనం కాకుండా రాజీ కుదురించుకున్నారు. దీంతో నిజాంకు సంబంధించిన తాబేదార్ల రాక్షస కృత్యాలు, పోలీసులు, దొరలు, భూస్వాములు, రజకార్ల హింసలు ప్రజలపై పెరిగాయి. ఈక్రమంలోనే నిజాం సర్కార్‌పై సాగుతున్న తెలంగాణ సాయుధ పోరు ఉధృతమయ్యింది. స్వాంతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని చాటుతూనే ముందుకు సాగిన పోరాటాలకు సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి మండలం మానాల ప్రధాన కేంద్రంగా మారింది. సిరిసిల్లకు చెందిన అమృత్‌లాల్‌శుక్లా, బద్దం ఎల్లారెడ్డిల నాయకత్వంలో కార్యకర్తలకు గాయిది గుట్ట శిక్షణా కేంద్రంగా ఉండేది. కమ్యూనిస్టు గెరిల్లాకు గ్రామ భూస్వామి రాజిరెడ్డి భోజనాలు సరఫరా చేసేవారు. మానాలలో గెరిల్లాలు శిక్షణ పొందుతుండగా... వంద మంది నిజాం సర్కారు పోలీసులు నిర్బంధించి రుద్రంగి క్యాంపునకు గెరిల్లాలను తరలించారు. ఆ తరువాత నీలం కిష్టయ్య, ముదాం ఎల్లయ్య, సిలివేరు ఎల్లయ్య, లకావత్ కిషన్‌లను మానాల అడవుల్లోకి తీసుకువెళ్లి వారి చేతనే కట్టెలు కొట్టించి, చితి పేర్చి తుపాకులతో కాల్చి దహనం చేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని సాగిస్తూ కమ్యూనిస్టు గెరిల్లాలు బార్డర్ క్యాంపులను నెలకొల్పారు. యూనియన్ రాష్ట్రాల్లోని కమ్యూనిస్టు నాయకుల సహకారంతో మరింత శిక్షణ పొందారు. నిమ్మపల్లి, మానాల అడవుల్లో నిజాం సర్కారు పోలీసుల కన్నుగప్పి శిక్షణలు పొందేవారు. మానాలలో ఉద్యమాన్ని అణచడానికి పుట్టుకొచ్చిన కోర్టులను నక్సలైట్లు హతమార్చిన సంఘటనలే కాక గెరిల్లా శిక్షణ కేంద్రానికి నిలువైన ఆనాటి గుట్టపైనే పది మంది మావోయిస్టు నక్సలైట్లను పోలీసులు కాల్చిచంపిన నెత్తుటి దారలు కూడా ఉన్నాయి. మానాల ఉద్యమ కేంద్రంగా ఉండగా... ఆసియాఖండంలోనే పీపుల్స్ వార్ నిర్మించిన అతిపెద్ద తొలి మహిళా స్తూపం కూడా ఉద్యమ జ్ఞాపకాలను కదలాడిస్తోంది.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీ..



ఎల్లారెడ్డిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



కోనరావుపేటలో జవాన్ వంశీని సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు గురువారం హర్ ఘర్ తిరంగా ప్రదర్శనను నిర్వహించారు. జాతీయ జెండాలతో ద్విచక్ర వాహన ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, గణేశ్, బుగ్గారెడ్డి, యాదగిరి, సంజీవరెడ్డి, శ్రీశైలం, లక్ష్మారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కిరణ్‌నాయక్ పాల్గొన్నారు.

ముస్తాబాద్ : మండల కేంద్రంలో మంగళిగడ్డ హనుమాన్ ఆలయం నుంచి బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, హర్ ఘర్ తిరంగా మండల కన్వీనర్ ఏదునూరి గోపి, బుచ్చెల్లి మహేశ్వరి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మీన సంజీవ్, చిట్నేని శ్రీనివాస్, జిల్లెల్ల మల్లేశం, మీన శంకర్, చంద్రారెడ్డి, మ్యాలక లింగం పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ, విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోలా అంజనేయులు,బక్కశెట్టి రాజేందర్, ఇటుకుల మహేందర్, ఇటికల రాజు, రెడ్డిమల్ల ఆశీర్వాద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట : స్వతంత్ర పోరాటయోధుల విగ్రహాలకు బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కర్ బాలాజీ ఆధ్వర్యంలో పూజను నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాట మహనీయులు అల్లూరి సీతారామరాజు, చాకలి ఐలమ్మ విగ్రహాలను శుద్ధిచేసి పూజలు నిర్వహించారు. దేశ భద్రత కోసం ప్రతిక్షణం బార్డర్‌లో రక్షణగా ఉంటున్న భారత జవాన్ ముష్కం వంశీని శాలువాతో సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పురుషోత్తంరావు, బైరగోని సురేష్, పాలకుర్తి శ్రీనివాస్, దుర్గం తిరుపతి, నర్సయ్య, నారాయణ, జనార్దన్, మల్లేశం, శంకర్, తిరుపతిరెడ్డి, వేణు, మహేష్, శేఖర్, మహేందర్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సరిపడా యూరియాను అందించాలి

**- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్**




సిరిసిల్లలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న రైతులందరికి సరిపోయే యూరియాను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు యూరియాను తగ్గించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. జిల్లాలోని రైతులకు వర్షాలకాలనికి సరిపడి యూరియాను అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలోని సహకార సంఘ గోదాముల వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు క్యూలు కట్టి యూరియా బస్తాల కోసం నిలుచున్న వారి బాధలను పట్టించుకునే వారే లేకుండాపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం జిల్లాలలో యూరియా కొరత లేని రైతులు ఆందోళనలు చెందవద్దని ప్రకటనలు చేస్తున్నారన్నారు. అలాగే ప్రైవేటు వ్యాపారులు కూడా ఇదే అదునుగా భావించి ఒక యూరియా బస్తా రూ 310 నుంచి రూ.350 వరకు అమ్మూతూ యూరియాతోపాటు మిగతా ఫర్టిలైజర్‌లను కొనుగోలు చేస్తేనే యూరియాను ఇస్తామని అవసరం లేకున్న దంటు గోళీలు గడ్డి మందు తదితర ఫర్టిలైజర్ మందులను అంటగడుతున్నారని వారిపై వ్యవసాయ శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గతంలో ప్రతి సహకార సంఘ గోదాంలల్లో నిల్వ ఉండే యూరియా బస్తాలు కనిపించడం లేదన్నారు. యూరియా బస్తాల కేటాయింపుల్లో కూడా పెద్ద రైతులు భూస్వాములు లైన్‌లో ఎక్కడ కనిపించడం లేదన్నారు. వారికి యూరియా ఎక్కడినుంచి అందిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు స్పందించి సీజన్‌కు సరిపడా యూరియాను అందించాలని లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులతో ఆందోళనలు ధర్నాలు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోడం రమణ, విమల పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆర్డర్‌లకు కూలి పెంచాలి..

తంగళ్లపల్లి : టెక్స్‌టైల్ పార్క్‌లోని పరిశ్రమలల్లో తయారుచేస్తున్న ప్రభుత్వ ఆర్డర్ల వస్త్రాలకు కూలి పెంచాలని సీఐటీయూ పవర్ లూం వర్కర్స్ యూనియర్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్క్‌లో గురువారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్క్‌లోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల కూలి ఒప్పందం గడువు ముగిసినా కూడా యాజమానులు కూలి పెంచడం లేదన్నారు. దీనిపై యాజమానులు వెంటనే స్పందించి కార్మికులతో చర్చలు జరపాలన్నారు. 2023 సంవత్సరాలనికి సంబంధించిన 10 శాతం యారన్ సబ్సిడీ కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పనికి తగిన వేతనం రాకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోతున్నాయని అన్నారు.

ఈ సమావేశంలో అధ్యక్షుడు కూచన శంకర్, సంపత్, శ్రీనివాస్, శ్రీకాంత్, అంజనేయులు, రామచంద్రం, వేణు, వెంకటేశం, అంబదాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో పిచ్చి కుక్కల స్వైర విహారం

**- ఇద్దరు విద్యార్థులు, లేగదూడకు తీవ్ర గాయాలు**

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని నారాయణపూర్, మద్దిమల్లతండాల్లో పిచ్చి కుక్కలు గురువారం స్వైరవిహారం చేశాయి. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలోని ఆరో తరగతి విద్యార్థులు మోతె గ్రీస్మంత్‌రెడ్డి, ఇందూరి శ్రీకాంత్‌లపై రెండు పిచ్చికుక్కలు దాడి చేసి గాయపర్చాయి. విద్యార్థులకు కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు. వీర్నపల్లి మండలం మద్దిమల్లతండాలోని రైతు భానుచందర్ లేగదూడపై పిచ్చి కుక్కలు దాడికి దిగాయి.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కమిషన్ బీజేపీతో చేతులు కలపడం వల్లనే దొంగ ఓట్లు సాధ్యమైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నేతన్న విగ్రహం నుంచి గాంధీచౌక్ వరకు ఓటు చోర్ గద్దె చోడ్ అనే నినాదంతో కొవ్వొత్తుల ర్యాలీతో నిరసనలు తెలిపారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోది నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఓట్లను దొంగలిస్తూ గెలుస్తున్న వైనాన్ని సోనియాగాంధీ నాయకత్వంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖార్గే ప్రజా పోరాటాలు చేస్తూ ముందుకు వెల్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఓట్ల చోరీపై ఒక సినిమాల వీడియో రూపంలో చూపిస్తుంటే బీజేపీ ఈ రూపకంగా దొంగ ఓట్లతో గెలుస్తుందన్న భావన ప్రజలో వచ్చిందన్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే పెద్దల గొంతుకలను నొక్కుతూ ఎంపీలను అరెస్టు చేస్తూ జైలుకు పంపే ప్రయత్నాని తప్పుపడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు ఖార్గే, టీపీసీసీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు కొవ్వొత్తుల ర్యాలీలతో నిరసనలు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మూల స్వరూపతిరుపతిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధానకార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కాంగ్రెస్ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, టీపీసీసీ కో ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, పార్లమెంట్ కో ఆర్డనేటర్ కనమేని చక్రధర్‌రెడ్డి, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### బీమాతో పాత్రికేయుల కుటుంబాలకు ధీమా

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బీమా పాత్రికేయుల కుటుంబాలకు ధీమానిస్తుందని సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణ ప్రెస్‌క్లబ్ సభ్యులకు ఒక సంవత్సరం కాలానికి ఓ ఇన్సూరెన్స్ కంపనీ నుంచి జీవిత బీమాను కేకే మహేందర్‌రెడ్డి ఇప్పించారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి కేకే మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దాదాపు 98 మంది పాత్రికేయులకు జీవిత బీమా కార్డులను కేకే మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా పాత్రికేయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కో కన్వీనర్ కనిమేని చక్రధర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకు నూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ ఖాజా, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, ప్రెస్‌క్లబ్ కార్యవర్గం సభ్యులు, సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

### 'శిక్షణ తరగతులకు ముఖ్యమంత్రి అంగీకారం'

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వాలన్న తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇవ్వడంపై ఆర్‌ఎంపీ, పీఎంపీ, కమ్యూనిటీ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రం శివనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిసి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, సహకరించిన కేకే మహేందర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుడికాల రవికుమార్, ప్రధాన కార్యదర్శి అలువాల ఈశ్వర్, కోశాధికారి జడల అశోక్ ఉపాధ్యక్షుడు తవటం శ్రీకాంత్, ప్రచార కార్యదర్శులు బక్కి. వెంకటేష్, బింగి రామకృష్ణ పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్ల వితరణ

ఇల్లంతకుంట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచ్ ముత్యం అమర్‌గౌడ్ ప్లేట్స్‌ను వితరణ చేశారు. పాఠశాల ఆవరణలో గురువారం సమావేశం జరిగింది. విద్యార్థులకు 30ప్లేట్స్‌తో పాటు రూ 2వేల విలువైన బహుమతులు అందించారు. నారాయణ ఫౌండేషన్ పక్షాన విద్యార్థులకు ఐడీకార్డులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనువేజు రాజు, ఫౌండేషన్ బాధ్యులు ప్రదీప్, లక్ష్మీలతో పాటు గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆదర్శ పాఠశాలలో నమూనా ఎన్నికలు

ఇల్లంతకుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో నమూనా ఎన్నికలు జరిగాయి. విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఓటర్‌జాబితా ప్రకటన, ఎన్నికలలో పోటీచేయడం, ఓట్లు వేయడం అంశాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాదర్, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 108 అంబులెన్స్‌లో ప్రసవం..

చందుర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన గర్భిణి శిరీష గురువారం ఉదయం పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించి ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ మలావత్ గణేష్, పైలట్ పంతంగి మహేష్ తెలిపారు. అనంతరం వారిని వేములవాడలోని మాతాశిశురక్షలో చేర్పించారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రుద్రంగి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వేంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర, మై భారత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై వ్యసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మధువాణి తదితరులు పాల్గొన్నారు.

### జ్వరాలపై ఇంటింటా సర్వే

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వైద్య సిబ్బంది గురువారం ఇంటింటా జ్వరాల సర్వే నిర్వహించారు. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలను ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. రక్త నమూనాలను సేకరించారు. మందులను అందజేశారు. వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శారద, లత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ అలసత్వం వల్లే యూరియా కొరత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అలసత్వం వల్లే ప్రస్తుత సీజన్‌లో యూరియా కొరత నెలకొందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ పంటలకు సరిపడా యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ పనులను వదులుకుని యూరియా కోసం అన్నదాతలు పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి యూరియాను సరఫరా చేసి రైతుల ఇబ్బందులను తీర్చాలని నర్సయ్య కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బాబు, రాజేందర్, శ్రీనివాస్, గౌస్, బుచ్చాగౌడ్, రాములు, గోపాల్, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

### బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులకు వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులకు కరీంనగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 100 మందికి పరీక్షలు జరిపారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బంది కరుణాకర్, లక్ష్మీరాజం, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

### లైన్‌మన్ కుటుంబానికి ఆర్థిక సహాయం

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘంలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు సంస్థ ఎల్లప్పుడు అండగా ఉంటుందని చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. సెస్ పరిధిలోని తంగళ్లపల్లి మండలంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న గిరి రాములు ఇటీవలఅనారోగ్యంతో మరణించడంతో అతనికి రావాల్సిన రూ.5,58,020 చెక్కును గురువారం సెస్ ప్రధానకార్యాలయంలో కుటుంబీలకు అందించారు.

### వైద్యశిబిరానికి స్పందన

తంగళ్లపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇందిరమ్మకాలనీలో తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్వర్యంలో గురువారం చేపట్టిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ దీప్తి 154 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేయంతోపాటు 25 మందికి రక్త పరీక్షలను చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల, ఏఎన్‌ఎంలు జ్యోతి, ప్రమీల, సతీష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అనూష, గ్రామస్థులు పాల్గొన్నారు.

### రేషన్‌కార్డుల పంపిణీ

తంగళ్లపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలందరికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌కార్డులను నిరంతరం అందించడం జరుగుతుందని సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరేళ్ల నర్సింగం గౌడ్ అన్నారు. మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాల్గాం ప్రవీణ్‌తో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు అంజయ్య, ప్రధానకార్యదర్శి కంకణాల లక్ష్మన్, భైరి శ్రీనివాస్‌రెడ్డి, బాలసాని రాజు, భానుచందర్, సాయిరెడ్డి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎరువుల కేంద్రాన్ని ప్రారంభించనున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందికట్కూర్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల కేంద్రాన్ని శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలు ప్రారంభిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.